## క్లుప్తంగా

### ఘనంగా ఆశా వర్కర్స్ డే



ద్రాక్షారామలో ఆశా వర్కర్స్ డే వేడుకల్లో ఆశాలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మార్కెట్ యార్డులో శనివారం ఆశా వర్కర్స్ డేను పురస్కరించుకుని ఘనంగా వేడుకలు నిర్వహించుకున్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలకా సుభాషిణిల ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు కేక్ కట్ చేసి పంచారు. బలరాం, సుభాషిణిలు మాట్లాడుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాల ఫలితంగా ప్రస్తుతం రూ.10 వేల వేతనం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తల నాయకులు డి.పుష్పలత, హేమలత, వరలక్ష్మి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

### నేడు లొల్లలో ప్రత్యేక వైద్య శిబిరం

రాయవరం: మండలంలోని లొల్ల గ్రామంలోని విశ్వ మానవత ఆశ్రమంలో ఆదివారం ప్రత్యేక ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని విశ్వమానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాస చౌదరి శనివారం విలేకరులకు తెలిపారు. ధ్యాన యోగం, యోగ చికిత్స, హోమియోపతి వైద్యం, ఆయుర్వేద, ఆరోగ్యకర ఆహారంపై ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కార్యకర్తలకు ఆరోగ్య జీవనంపై శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు.

### అన్నప్రసాద వితరణ

రామచంద్రపురం రూరల్: గణపతి నవరాత్రుల సందర్భంగా ద్రాక్షారామ శ్రీలక్ష్మీ గణపతి టాక్సీ స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం సుమారు 5 వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ప్రముఖ దాత సత్తి సుబ్బారెడ్డి, గ్రామస్తుల సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో టాక్సీ స్టాండ్ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### మణికంఠకు ఉత్తమ సేవల పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మణికంఠ

కె.గంగవరం: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినం సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు జిల్లా కేంద్రమైన అమలాపురంలో శుక్రవారం సాయంత్రం పురస్కారాలు అందించారు. కె.గంగవరం మండలం నుంచి అముజూరు సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ మణికంఠకు ఈ ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని జిల్లా పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎండీ అల్లేముల్లా చేతుల మీదుగా మణికంఠ ప్రశంసాపత్రంతో పాటు మెమెంటోను అందుకున్నాడు. ఉత్తమ సేవా పురస్కారం లభించడంపై రామచంద్రపురం డీఈఈ భూషణ్ ప్రసాద్, జేఈ ఏసురత్నం, సర్పంచ్ నానాపరపు కళ్యాణి తదితరులు మణికంఠను అభినందించారు.

### పీఆర్ జేఈ రాఘవులుకు అభినందనలు



కపిలేశ్వరపురం: పంచాయతీరాజ్ శాఖ కపిలేశ్వరపురం జేఈ దేవరపల్లి వీరరాఘవులు, నల్లూరు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ వింటి వీర లక్ష్మిలకు ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. ఇంజినీరింగ్ దినోత్సవం నేపథ్యంలో వారిరువురినీ ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వారిని శనివారం కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో సత్కరించారు. ఎంపీడీఓ కొండలరావు, కార్యాలయ ఏఓ ఎంవీ ప్రకాష్, సిబ్బంది, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అభినందించారు.

### గణపతి మంటపాల్లో అన్నదానాలు

మండపేట: గణపతి నిమజ్జనాలు పూర్తి కావడంతో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణేశ్ మంటపాల వద్ద ఘనంగా అన్నదానాలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోను, మండలంలోని వివిధ గ్రామాల్లోనూ శనివారం అన్న సంతర్పణలు విరివిగా జరిగాయి. పట్టణంలోని కేపీ రోడ్డు వరసిద్ధి వినాయకుడి మంటపం వద్ద, ఏడిద రోడ్డులోని ప్రభుత్వ పాఠశాల పక్కన నెలకొల్పిన వినాయక మండపం వద్ద అన్నదానాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కేపీ రోడ్డులోని అన్నదానాన్ని ప్రారంభించారు.ఇక్కడ సుమారు 5 వేల మందికి అన్నదానం చేసినట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకుడు పుచ్చకాయల సత్యనారాయణ తెలిపారు. అలాగే మండలంలోని ద్వారపూడిలో ఘనంగా అన్నదానం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి గణపతి ప్రసాదాన్ని స్వీకరించారు.

# పదింతల ప్రణాళిక

- టెన్త్‌లో మెరుగైన ఫలితాలకు ముందస్తు కార్యాచరణ
- ఈ ఏడాది జూలై నుంచే ప్రత్యేక తరగతులు
- క్లస్టర్ పరిధిలో 4,852 మంది టెన్త్ విద్యార్థులు



రాయవరం మండలం వెంటూరు జెడ్పీ హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతి

రాయవరం: ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్‌లో మెరుగైన ఫలితాల సాధనకు విద్యాశాఖ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే కసరత్తు చేపట్టింది. 2024–25 విద్యా సంవత్సరం ఈ ఏడాది జూన్ 12 నుంచి ప్రారంభమైంది. ఈ నెలలోనే సెల్ఫ్ అసెస్‌మెంట్–1 పరీక్ష నిర్వహించారు. గతేడాది టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. వాటిని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఈ ఏడాది కూడా ప్రభుత్వ ఆశయాన్ని సాకారం చేసేందుకు ముందస్తు ప్రణాళికలు రచించారు. గతానికి భిన్నంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో టెన్త్ విద్యార్థులకు ఆగస్టు నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

**మెరుగైన ఫలితాల సాధనకు..**

ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాల సాధనకు విద్యాశాఖ ‘పదింతల’ కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే విద్యాశాఖ ఆధ్వర్యంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు నిర్వహించగా, అక్టోబరులో సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తారు. క్లస్టర్ పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో 54 ఉన్నత పాఠశాలలు ఉండగా, గతేడాది 4,985 మంది విద్యార్థులకు గాను 4,504 మంది టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది 4,852 మంది విద్యార్థులు టెన్త్ చదువుతున్నారు. ఈ ఏడాది శత శాతం ఉత్తీర్ణత సాధనకు ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికతో జిల్లా విద్యాశాఖ ముందుకు వెళుతోంది.

**రెండు పూటలా ప్రత్యేక తరగతులు**

టెన్త్ విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా ఏటా పరీక్షలకు ముందు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. సాధారణంగా సమ్మేటివ్–1 పరీక్షల అనంతరం నవంబర్ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఆగస్టు నుంచే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండడం గమనార్హం. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకూ ప్రత్యేక తరగతులు జరుపుతున్నారు. ఆదివారం సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండడం గమనార్హం.

**వెనుకబడిన విద్యార్థులపై..**

ప్రతి రోజూ సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా, ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. బి కేటగిరీ విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో బాగా చదువుతూ మరికొన్నింటిలో వెనుకబడుతుంటారు. అలాగే సి కేటగిరీ విద్యార్థులు ఒకటి రెండు సబ్జెక్టులు తప్ప మిగిలిన సబ్జెక్టుల్లో వెనుకబడుతుంటారు. అలాంటి వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. మరోపక్క నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు స్టడీ మెటీరియల్స్ సిద్ధం చేసుకుంటున్నారు.

**ప్రారంభం నుంచే..**



ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే టెన్త్ ఫలితాలపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఏడాది ఆగస్టు నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు తు.చ తప్పక పాటిస్తున్నాం. రామచంద్రపురం డివిజన్‌ను మరింత మెరుగైన స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం. పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.

– శ్రీపాద లక్ష్మీనరసింహఫణి, డీవైఈవో, అమలాపురం

**ప్రణాళికాబద్ధంగా..**



టెన్త్‌లో మెరుగైన ఉత్తీర్ణత సాధనకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాం. సెల్ఫ్ అసెస్‌మెంట్–1 పరీక్షల ఫలితాల ఆధారంగా విద్యార్థుల విద్యా స్థాయిని అంచనా వేసుకుంటున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నాం. ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో విద్యార్థుల ప్రగతిపై సమీక్ష చేస్తున్నాం

– ఎం.వెంకట్రాజు, హెచ్ఎం, ఏడిద హైస్కూల్, మండపేట మండలం

### అర్తమూరులో హోమియో వైద్య శిబిరం



రోగులకు మందులు వేస్తున్న హోమియో వైద్యులు

మండపేట: బీఎస్సార్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అర్తమూరు గ్రామంలో 175వ ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని యూనియన్ బ్యాంక్ ద్వారపూడి శాఖ మేనేజర్ శ్రీనివాస్ ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన అల్లు రామలింగయ్య హోమియో వైద్య కళాశాల వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేశఋూరు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధినేత సత్తి బులిస్వామిరెడ్డి, హోమియో వైద్యులు జ్యోతి, సుమమాధురి, శివకుమార్, సుజన, మార్కండేయులు, శివకుమార్, పద్మావతి, ట్రస్టు సభ్యులు తాడి సుబ్బిరెడ్డి, ఓగిరెడ్డి రామారెడ్డి, తాడి శ్రీనివాస్‌రెడ్డి, చిర్ల రామకృష్ణారెడ్డి, చింతా వెంకటకృష్ణారెడ్డి, ఎస్ఎస్‌వీ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు కపిలేశ్వరపురానికి ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం: మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కపిలేశ్వరపురంలో గ్రామ సచివాలయం వద్ద నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపీడీఓ కొండలరావు శనివారం తెలిపారు.

## పారిశుధ్యానికి పెద్ద పీట వేశాం

- ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
- డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మహిళలు



పడమర ఖండ్రికలో ర్యాలీలో చేస్తున్న సచివాలయం, పీహెచ్‌సీ ఉద్యోగులు

మండపేట: నియోజకవర్గంలో పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేశామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. డ్వాక్రా పొదుపు సంఘాల మహిళల ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం స్వచ్ఛభారత్ ర్యాలీ జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, ఎమ్మెల్యే వేగుళ్ల ముఖ్య అతిథులుగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి పెద్ద కాలువ వంతెన వరకూ కొనసాగిన ర్యాలీలో మహిళలు స్వచ్ఛత హి సేవపై ప్రజలకు అవగాహన కల్పించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి మహిళా తమ ఇళ్లలో పోగైన చెత్తను డస్ట్‌బిన్‌లు ఉపయోగించి వాటి ద్వారా పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కౌన్సిలర్లు పిల్లి శ్రీనివాస్, మందపల్లి రవికుమార్, నీలం దుర్గమ్మ, యరమాటి గంగరాజు, కాశిన కాశీవిశ్వనాథం, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కొప్పిరెడ్డి పద్మావతి, డీఈ కె.శ్రీనివాస్, మెప్మా టీఈ అనంతలక్ష్మి, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

**పారిశుధ్యం ప్రాణ పరిరక్షణకు దోహదం**

కపిలేశ్వరపురం: పారిశుధ్య నివాసితుల ప్రాణాల పరిరక్షణకు దోహదం చేస్తుందని మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛత హి సేవలో పాల్గొన్న వక్తలన్నారు. ఎంపీడీఓ కొండలరావు పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలపై శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పడమర ఖండ్రికలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నల్లూరు సచివాలయం ప్రత్యేక ప్రచార రథంపై కళాకారులు స్వచ్ఛ భారత్ ప్రాధాన్యతను వివరిస్తూ కళా ప్రదర్శన ఇచ్చారు. కపిలేశ్వరపురంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద తడిచెత్త, పొడి చెత్త వినియోగాలపై ప్రజలకుఅవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో సర్పంచులు తిరునాతి ఆదిలక్ష్మి, సాకా శ్రీనివాస్, కార్యదర్శిలు, అంగర పీహెచ్‌సీ ఆరోగ్య కార్యకర్త వెన్నేటి వెంకటేశ్వరరావు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత



స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సుభాష్

రామచంద్రపురం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రజలందరి బాధ్యత అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. స్థానిక వీఎస్ఎం కాలేజీ నుంచి రాజగోపాల్ సెంటర్ వరకు శనివారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం మీద ప్రజలకు అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 1 వరకు 15 రోజుల పాటు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు దేశ వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కూటమి నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు మున్సిపల్ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**సీసీ రోడ్డుకు శంకుస్థాపన**

పట్టణంలోని 4వ వార్డులో రూ.30 లక్షల 90 వేలు మున్సిపల్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శనివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శంకుస్థాపన చేశారు. ఎన్డీఏ కూటమి పాలనలో రానున్న ఐదు సంవత్సరాల్లో రామచంద్రపురం నియోజకవర్గాన్ని స్వర్ణ రామచంద్రపురంగా తీర్చిదిద్దామన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### వెల్‌నెస్ సెంటర్ సందర్శించిన టాస్క్‌ఫోర్స్ బృందం



అంగర పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న టీం సభ్యులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర –2 సచివాలయం పరిధిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను శనివారం డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు సందర్శించారు. గర్భిణి, బాలింతలు, 12–19 వయసు బాలికలకు వివిధ దశలలో అందించాల్సిన వైద్య, ఆరోగ్య సదుపాయాలపై అంగర పీహెచ్‌సీ అధికారులు, సిబ్బందితో చర్చించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పీహెచ్‌సీ సిబ్బంది అమలు చేస్తున్న తీరును, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రికార్డుల నిర్వహణ తీరును టీం సభ్యులు కె.సూరిబాబు, ఎన్.రవి, పీబీఎల్ కుమారి, ఎస్‌టీపీపీ కృష్ణమోహన్, కె.దేవా పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలోని సేవలను ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్‌లు తాతపూడి మేరీమణి, పెమ్మరాజు సురేష్, ఎంఎల్‌హెచ్‌పీ కె.రమాదేవి, ఏఎన్ఎం సీహెచ్‌దుర్గ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శెట్టిబలిజ సమావేశాన్ని విజయవంతం చేయండి

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం పట్టణంలోని శెట్టిబలిజ సంఘ భవనంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న తాలూకా శెట్టిబలిజ సంఘం సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘ అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ విలేకరులకు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు రాజ్యసభ సభ్యుడు, సంఘ గౌరవాధ్యక్షుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో సాధారణ సమావేశం, సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని రామచంద్రపురం పట్టణం, రూరల్, కె.గంగవరం, కాజులూరు మండలాల్లోని శెట్టిబలిజ సంఘ పెద్దలు, సభ్యులు, ప్రజాప్రతనిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పంట పొలాలపై పందుల దాడి



తర్లంపూడిలో పంట పంటపొలాల్లో చొరబడి వరి మొక్కలు తింటున్న పందులు

కాజులూరు: మండలంలోని తర్లంపూడిలో పందుల స్వైరవిహారం రోజురోజుకూ అధికమవుతోంది. నిన్నమొన్నటి వరకూ గ్రామ వీధుల్లోనూ, ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్యకేంద్రం ఆవరణల్లోనూ యథేచ్ఛగా సంచరిస్తూ పరిసరాలను అస్తవ్యస్తం చేస్తూ వస్తున్న పందులు తాజాగా పంటపొలాలపై దాడి చేస్తుండటంతో పరిసర పొలాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పందులు పొలం మధ్యలోకి వెళ్లి వరి కంకులను కొరికి తింటున్నాయి. పొలాన్ని సైతం అవి తొక్కి చిందరవందర చేస్తున్నాయని రైతులు చెబుతున్నారు. తర్లంపూడి, జగన్నాథగిరి గ్రామాల సరిహద్దులో రహదారికి ఇరువైపులా జగన్నాథగిరికి చెందిన కొందరు పాకలు వేసి పందులు పెంచుతున్నారని రాత్రి సమయాల్లో పందులను తమ గ్రామంలోని పొలాల్లోకి వదులుతున్నారని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి పందులను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

### ఉచిత కంటి వైద్య శిబిరం

రామచంద్రపురం రూరల్: మండలంలోని జగన్నాయకులపాలెంలో సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో కిరణ్ కంటి ఆసుపత్రి నేతృత్వంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ అంబటి భవాని ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ మాధవీలత 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మందికి శస్త్ర చికిత్సకు, 34 మందికి కళ్ల అద్దాలు సిఫారసు చేశారు. కంటి చుక్కలు, మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఏవీవీ సత్యనారాయణ, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఏడిద పాఠశాలలో బాలికలకు క్రీడా పోటీలు



ఏడిద క్రీడా ప్రాంగణంలో పోటీలకు సిద్ధమైన విద్యార్థినులు

మండపేట: మండలంలోని ఏడిద జెడ్పీ హైస్కూల్లో శనివారం బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్ –14, అండర్– 17 విభాగాల్లో ఏడు క్రీడాంశాల్లో బాలికలకు ఈ పోటీలు నిర్వహించారు. మండలంలోని 13 పాఠశాలల నుంచి విద్యార్థినులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలైన విద్యార్థినులు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని ఆ పాఠశాల హెచ్ఎం ముంగర వెంకట్రాజు తెలిపారు. కార్యక్రమంలో మండపేట జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు చేకూరి కృపారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సత్తా చాటిన వేగాయమ్మపేట విద్యార్థులు



మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన వేగాయమ్మపేట విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో వేగాయమ్మపేట శ్రీమతి మహాలక్ష్మమ్మ హిందూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.సోమసుందరం శనివారం విలేకరులకు తెలిపారు. కబడ్డీ అండర్–14 బాలుర విభాగంలో పి.సాయిగణేష్, పి.సూర్యతేజ, అండర్–17 విభాగంలో ఆర్.సూర్యతేజ, వాలీబాల్ అండర్–14లో పి.సూర్యతేజ, అండర్–17లో సీహెచ్ ధనుష్‌కుమార్, ఖోఖో అండర్–14 లో పి.సూర్యతేజ, పి.సాయిగణేష్, అండర్–17 లో సీహెచ్ ధనుష్ కుమార్, సీహెచ్ నరేష్‌కుమార్‌లు ఎంపికయ్యారు. అదే విధంగా బాలికల విభాగంలో కబడ్డీ అండర్–14 లో కె.తేజస్విని, సీహెచ్ జయలక్ష్మిశ్రీ, కె.అనంతలక్ష్మి, అండర్–17 విభాగంలో కె.అనిత, ఖోఖో అండర్–14 విభాగంలో కేఎంవీవీ లక్ష్మి, సీహెచ్ జయలక్ష్మిశ్రీ, అండర్–17లో కె.ఝాన్సీలక్ష్మీ దుర్గ, కె.మంజూషలు మండల స్థాయి క్రీడా పోటీల్లో తలపడి విజేతలుగా నిలిచారని తెలిపారు. వీరు ఈ నెల 23, 24 తేదీల్లో రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా మైదానంలో జరిగే నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయిని అనురాధలను ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, సర్పంచ్ అంబటి తుకారం, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఎస్.శ్రీనివాసు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## క్రీడలపై ఆసక్తి పెంపొందించాలి



గొల్లపాలెంలో స్పోర్ట్స్ యూనిఫాం పొందిన బాలికలతో ఎంఈఓ జాన్ తదితరులు

కాజులూరు: విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించాలని మండల విద్యాశాఖాధికారి జాన్ అన్నారు. గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న స్కూల్ గేమ్స్ సెలక్షన్ శనివారం ముగిసింది. స్కూల్ హెచ్ఎం ఎస్ఎస్‌బీ సుశీలామణి అధ్యక్షతన జరిగిన సభలో ఎంఈఓ జాన్ మాట్లాడుతూ క్రీడల ప్రాధాన్యతను విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక నేత నున్న కాశీవిశ్వనాథం సమకూర్చిన 25 స్పోర్ట్స్ యూనిఫాంను క్రీడాకారిణులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొలిశెట్టి సత్యం, స్కూల్ పీడీ సునీల్‌కుమార్, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జీజేఆర్ఎస్ కొర్, స్థానిక నాయకులు అంగర కృష్ణ, డేగల సతీష్, వడ్డి శ్రీను, అంగర శ్రీను పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా పోషకాహారం తీసుకోవాలి

- పౌష్టికాహార మాసోత్సవ ముగింపు కార్యక్రమంలో వక్తలు



అంగరలో సీమంతం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రణాళికాబద్ధంగా పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని వక్తలన్నారు. పౌష్టికాహార మాసోత్సవ ముగింపు అవగాహన కార్యక్రమాలు మండలంలోని అంగర, కపిలేశ్వరపురం గ్రామాల్లో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి, ఎంపీడీఓ కొండలరావులు తమ ప్రసంగాల్లో మాసోత్సవం సందర్భంగా చేపట్టిన కార్యాచరణను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు, అనుబంధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు మాసోత్సవాన్ని విజయవంతం చేయడంపై సీడీపీఓ అభినందనలు తెలిపారు. పోషక విలువలున్న ఆహారం తీసుకునే విధానంపై ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్ఈ బి.రామారావు తదితర ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లోని గర్భిణులకు సీమంతం చేశారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీలు శీలం భాస్కరరావు, అడ్డాల శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీ, ఎంపీటీసీ అంగర రామనర్సు తదితరులు పసుపు, కుంకుమ, పండ్లు, పూలు, గాజులు అందజేసి గర్భిణులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ ప్రాజెక్టులకు చెందిన సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్యదర్శిలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలి

రామచంద్రపురం: అనారోగ్యంతో, ప్రమాదలకు గురైనటువంటి ఆపదలో ఉన్న తోటి వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని, తోటి అంగన్‌వాడీ వర్కర్‌కు మిగతా అంగన్‌వాడీ వర్కర్లు తమ వంతు సహకారం అందించటం అభినందనీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కె.గంగవరం మండలం సుందరపల్లి గ్రామానికి చెందిన అంగన్వాడీ వర్కర్ వీరవేణి గ్యాస్ ప్రమాదంలో 40% వరకు కాలిన గాయాలతో రామచంద్రపురం ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. కాగా ఆమెకు రామచంద్రపురం ప్రాజెక్టు అంగన్వాడీలు మానవతా దృక్పథంతో రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సొంతంగా రూ.25 వేలు ఇవ్వగా మొత్తం రూ.75 వేలను శనివారం సీఐటీయూ మండల కన్వీనర్ మేడిశెట్టి దుర్గమ్మ చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

## అగస్త్యేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

రామచంద్రపురం: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయంలో శనివారం నిర్వహించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.బాలాజీ రాంప్రసాద్, దేవదాయ శాఖ అధికారులు పి.కనకలక్ష్మణరావు, ఎం.శ్రీదేవి, జూనియర్ అసిస్టెంట్ టి.సూర్యనారాయణ పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కించారు. కాగా స్వామికి హుండీలో భక్తులు సమర్పించిన నగదు మొత్తం రూ.2,73,095 వచ్చినట్లు అధికారులు తెలిపారు. 256 రోజులకు లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్టు వారు తెలిపారు. భక్తులు శివాలయానికి సంబంధించిన పలు సమస్యలను తనిఖీ అధికారి రాంప్రసాద్ దృష్టికి తీసుకురాగా వారు వెంటనే స్పందించి తగు పరిష్కారానికి ఉన్నతాధికారులతో మాట్లాడతామని తెలియజేశారు. స్థానిక నాయకులు సత్యవాడ శ్రీహరిపంతులు, సచివాలయ సిబ్బంది, 23వ వార్డు ప్రజలు భక్తులు పాల్గొన్నారు.